సాక్షి ఖమ్మం

సోమవారం । 14 । ఏప్రిల్ । 2025



ఖమ్మంలో మామిడి మార్కెట్!

మామిడి రైతులకు ప్రయోజనం కల్పించే లక్ష్యంతో ఖమ్మంలో మామిడి మార్కెట్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 8లో



..రాజ్యాంగమే బీజేపీ అజెండా

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగమే బీజేపీ అజెండా అని మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. 8లో

గరిష్టం / కనిష్టం

39° / 24°

వాతావరణం

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం మేఘావృతమై అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వెంకన్న సన్నిధిలో నూజివీడు జడ్జి పూజలు



పూజలు చేస్తున్న న్యాయమూర్తి దంపతులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని ఏపీలోని నూజివీడు స్పెషల్ కోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి. కృష్ణమూర్తి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, వేద పండితులు శాస్త్రోక్తంగా ఆలయ మర్యాదలతో వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీవేంకటేశ్వరస్వామి వారిని, శ్రీఅలివేలు మంగ, శ్రీపద్మావతి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందించి ఆశీర్వదించారు. కార్యక్రమములో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామ చంద్రమూర్తి, ఉప ప్రధాన అర్చకులు మురళీమోహన్‌శర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

'కాల్వల' పనులు సకాలంలో పూర్తి చేయాలి

- జలవనరుల శాఖ అధికారులకు తుమ్మల సూచన

ఖమ్మంఅర్బన్ : జిల్లాలో చేపడుతున్న కాల్వల ఆధునికీకరణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి, మరమ్మతులపై జలవనరులశాఖ సీఈ రమేష్‌బాబును ఫోన్ ద్వారా ఆదివారం అడిగి తెలుసుకున్నారు. గత ఆగస్టులో వచ్చిన అకాల వర్షాలతో కాల్వలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, వేసవి ముగిసేలోగా మరమ్మతులు పూర్తి కావాలని సూచించారు. పూడికతీత పనులు చేపట్టి చివరి ఆయకట్టు భూములకు నీరందేలా చూడాలని చెప్పారు. పనుల్లో నాణ్యత పాటించాలని, ఎక్కడా రాజీ పడకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతుల అవసరాల మేరకు ప్రణాళికాయుతంగా సాగునీరు విడుదల చేయాలన్నారు.

సాహిత్య భాస్కర బిరుదు ప్రదానం



చిననర్సయ్యను సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరానికి చెందిన కవి, రచయిత కట్టికోల చిన నర్సయ్యకు రామదాసు సాహితీ కళా సేవా సంస్థ 'సాహిత్య భాస్కర' బిరుదు ప్రదానం చేసింది. సాహిత్య రంగంలో కట్టికోల చేస్తున్న కృషిని గుర్తించిన సంస్థ.. హైదరాబాద్ త్యాగరాయ గానసభ కళా సంగీత నాట్య వేదిక ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందించింది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ దూత రామకోటేశ్వరరావు చేతుల మీదుగా బిరుదు అందించగా సంస్థ నిర్వాహకులు రాజగోపాల్, హైదరాబాద్ నగర ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ తేజావత్ రామదాసు, డాక్టర్ రాధాకుసుమ అభినందించారు.

పర్యాటకుల జలవిహారం

పాల్వంచరూరల్: పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 362 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా, వైల్డ్‌లైఫ్ శాఖ రూ.13,285 ఆదాయం లభించింది. 250మంది బోటుషికారు చేయగా, టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.10,180 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

హబ్.. డిస్టర్బ్



పెద్దాస్పత్రి ఆవరణలోని తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్

- ఖమ్మం టీ – హబ్‌లో పరీక్షలకు తరచూ అంతరాయం
- 134 టెస్ట్‌లకు గాను జరుగుతున్నవి 38 మాత్రమే
- రసాయనాల కొరతతోనే ఈ పరిస్థితి

ఖమ్మంవైద్యవిభాగం: పేదలకు ఉచితంగా 57 రకాల పరీక్షలు నిర్వహించేందుకు గత ప్రభుత్వం తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్లను అందుబాటులోకి తెచ్చింది. కొన్ని నెలల పాటు టెస్టులు సక్రమంగానే నిర్వహించగా, కొంతకాలంగా తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా రోగులకు ఉచితంగా పలు రకాల పరీక్షలు నిర్వహించడానికి నెలకొల్పిన హబ్‌లో ఎప్పుడు ఏ టెస్టు ఉంటుందో తెలియని దుస్థితి ఏర్పడింది. ఒకసారి బార్‌కోడ్‌ల కొరత, మరో సారి రసాయనాల సరఫరా లేకపోవడం వంటి సమస్యలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇలా ఏదో ఒక కారణంతో పరీక్షలకు తరచూ ఇబ్బందులు ఏర్పడుతూనే ఉన్నాయి. హబ్‌లో గతంలో క్లినికల్ పాథాలజీ, మైక్రోబయాలజీ, క్లినికల్ బయో కెమిస్ట్రీకి చెందిన 57 రకాల పరీక్షలు నిర్వహించేవారు. వాటికి మరి కొన్ని రకాల టెస్టులు జత చేసి ప్రస్తుతం ఆ సంఖ్య 134కు చేరింది. అయితే తరచూ ఏదో ఒక సమస్యతో ఇబ్బందులు ఎదురవుతుండగా ప్రస్తుతం నిర్వహించే టెస్టుల్లో సగం కూడా చేయని పరిస్థితి నెలకొంది. దీంతో అవసరమైన పరీక్షలు అందుబాటులో లేక జిల్లాలోని పేద పేషెంట్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ప్రైవేట్ డయాగ్నొస్టిక్ సెంటర్లను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు.

134 కాదు.. 38 మాత్రమే..

ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని డయాగ్నొస్టిక్ హబ్‌లో ప్రతీ గంటకు 1,520 టెస్టులు చేసే సామర్థ్యం ఉంది. ఇందులో కెమిస్ట్రీ ఎనలైజర్ మిషన్ ద్వారా 1,200 టెస్టులు, ఇమ్యూనో ఎనలైజర్ మిషన్ ద్వారా 220, సీబీపీ మిషన్ ద్వారా 100 టెస్టులు ఒకే సారి నిర్వహిస్తారు. అయితే ప్రభుత్వం హబ్ ద్వారా ప్రజలకు 134 టెస్టులు నిర్వహించాలని నిర్ణయించింది. కొంత కాలం పాటు చాలా వరకు సక్రమంగానే నిర్వహించే వారు. కానీ ఇటీవల అందుబాటులో ఉండే టెస్టులు సంఖ్య చాలా తగ్గిపోయింది. హబ్‌లో ఎప్పుడు ఏ టెస్టు ఉంటుందో తెలియక రోగులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ఇక్కడ లిపిడ్ ప్రొఫైల్, థైరాయిడ్, డీడైమర్, ఆర్‌ఎఫ్‌టీ యూరియా, కేన్సర్ యాంటీజెన్, డీ, బీ12, హెపటైటిస్ ఏ, సీ, ఈ, తలసేమియా సికిల్ సెల్ తదితర 96 రకాల టెస్టులు అందుబాటులో లేకుండా పోయాయి. బయోకెమిస్ట్రీకి చెందిన 64 టెస్టులకు గాను 18, పాథాలజీకి చెందిన 28 టెస్టులకు గాను 14, మైక్రోబయాలజీకి చెందిన 42 టెస్టులకు గాను ఆరు మాత్రమే నిర్వహిస్తున్నారు. కేవలం 38 రకాల పరీక్షలే నిర్వహిస్తుండడంతో చేసేది లేక రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. 134 రకాల టెస్టులు ఉచితంగా అందాల్సి ఉండగా, హబ్‌ను నిర్లక్ష్యం చేస్తుండడంతో ఈ దుస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం



ఆస్పత్రిలోని డయాగ్నస్టిక్స్ హబ్‌కు కొంత కాలంగా రసాయనాలు సరఫరా కావడం లేదు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానన్నారు. ఆస్పత్రిలో మాత్రం టెస్టుల నిర్వహణకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. సెంట్రల్ ల్యాబ్ ద్వారా పేషెంట్లకు అన్ని రకాల టెస్టులు అందిస్తున్నాం. త్వరలో రసాయనాలు సరఫరా అయ్యే అవకాశం ఉంది. అప్పుడు హబ్‌లో కూడా టెస్టులు సక్రమంగా జరుగుతాయి.

– ఎల్.కిరణ్‌కుమార్, పెద్దాస్పత్రి సూపరింటెండెంట్

రసాయనాల సరఫరా లేక..

డయాగ్నస్టిక్ హబ్‌కు జిల్లాలోని పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులకు సంబంధించి 40 సెంటర్ల ద్వారా శాంపిళ్లు వస్తుంటాయి. ఐదు వాహనాల ద్వారా నిర్దేశించిన రూట్లలో శాంపిళ్లు సేకరించి తెస్తుంటారు. ఇక్కడ హబ్‌లో టెస్టులు నిర్వహించి బాధితుల సెల్‌కు 24 గంటల్లో రిపోర్టులు మెసెజ్ రూపంలో పంపిస్తారు. ఆ మెసెజ్‌ను సంబంధిత వైద్యాధికారికి చూపించిన తర్వాత మందులు రాస్తారు. అవసరమైతే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేస్తారు. ఇది నిత్యం జరిగే ప్రక్రియ. కాగా ఇటీవల రసాయనాల(రీఏజంట్స్) సరఫరా లేక కొన్ని టెస్టులు నిలిచిపోతున్నాయి. చాలా కాలంగా రసాయనాల సరఫరాలో సమస్యలు ఏర్పడుతున్నాయి. ఇక్కడ పరీక్షలు నిర్వహించడానికి పలు రకాల రసాయనాలు అవసరం. వాటిని హైదరాబాద్ నుంచి సరఫరా చేస్తుంటారు. అయితే ఆయా రసాయనాలు లేనప్పుడు సంబంధిత టెస్టులు నిలిచిపోతున్నాయి. టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ ద్వారా ప్రభుత్వం రసాయనాలు సరఫరా చేస్తోంది. ఇటీవల సరఫరా నిలిచిపోవడంతో రోజూ నిర్వహించాల్సిన టెస్టుల్లో మూడో వంతు కూడా చేయలేని పరిస్థితి ఏర్పడింది.

నేడు స్తంభాద్రి గిరి ప్రదక్షిణ

ఖమ్మంగాంధీచౌక్: శ్రీ లక్ష్మీనరసింహ స్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా సోమవారం సాయంత్రం 5:30 గంటలకు ఖమ్మం నగరంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం(గుట్ట) చుట్టూ గిరి ప్రదక్షిణ నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. భక్తుల జయజయధ్వానాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఉత్సవమూర్తులతో గిరి ప్రదక్షిణ చేస్తారు. రాత్రి 7:30 గంటలకు కొండపై ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదికపై అర్చకులు, వేద పండితులు స్వాతి నక్షత్ర జ్యోతిని వెలిగిస్తారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ కార్యనిర్వహణాధికారి కొత్తూరు జగన్మోహన్ రావు ఒక ప్రకటనలో కోరారు.

ఆర్టీసీ.. ఆన్‌లైన్



ఐ-టిమ్స్ ఉపయోగిస్తున్న బస్సులు

- క్యూ ఆర్ కోడ్‌తో బస్సుల్లో చెల్లింపులు
- రిజర్వేషన్ బస్సుల్లో అందుబాటులోకి ఐ – టిమ్స్
- డిజిటల్ చెల్లింపులతో నగదు లేకున్నా బేఫికర్

డిపో	ఐ - టిమ్స్ బస్సులు
సత్తుపల్లి	22
ఖమ్మం	43
కొత్తగూడెం	08
భద్రాచలం	31
మణుగూరు	22
మధిర	07



ఐ-టిమ్స్‌లోని క్యూఆర్ కోడ్



క్యూఆర్ కోడ్ ఆధారంగా నగదు చెల్లిస్తున్న యువతి

సత్తుపల్లి టౌన్ : ఆర్టీసీ బస్సుల్లో నగదు రహిత సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇక బస్సుల్లో ప్రయాణికులు, కండక్టర్లు టికెట్ల సమయంలో ఎదుర్కొంటున్న చిల్లర సమస్యలకు తెరపడనుంది. ఖమ్మం రీజియన్‌లోని ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం ఆర్టీసీ డిపోల్లోని రిజర్వేషన్ బస్సుల్లో ఐ-టిమ్స్‌ను ప్రవేశపెట్టారు. రీజియన్‌లో 530 బస్సులు ఉండగా.. 40 రాజధాని బస్సులు, 75 సూపర్‌లగ్జరీ బస్సులు, 10 లహరి బస్సుల్లో తొలివిడతగా డిజిటల్ చెల్లింపు విధానం ప్రారంభమైంది.

నూతన సాఫ్ట్‌వేర్ అనుసంధానంతో..

రిజర్వేషన్ బస్సుల్లో ఉన్న పాత టిమ్‌ల స్థానంలో ప్రస్తుతం ఛలోయాప్ పేరిట నూతన సాఫ్ట్‌వేర్‌ను అనుసంధానం చేసిన కొత్త ఐ–టిమ్ మిషన్(ఇంటర్‌నెట్ టికెట్ ఇష్యూయింగ్ మిషన్)లు అందుబాటులోకి వచ్చాయి.

క్యూఆర్ కోడ్‌తో..

ఈ బస్సుల్లో టిమ్ మిషన్‌లోని క్యూఆర్ కోడ్‌ను ఫోన్ పే, గూగుల్‌పే, పేటీఎం వంటి మొబైల్ యాప్‌లతో స్కానింగ్ చేసి నేరుగా టికెట్ చార్జీలను చెల్లించవచ్చు. క్రెడిట్, డెబిట్ కార్డులను ఉపయోగించే విధంగా ఆధునిక టిమ్ యంత్రాలను రిజర్వేషన్ బస్సుల్లో ప్రవేశపెట్టారు. త్వరలో రీజియన్‌లోని ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సుల్లో సైతం ఈ నగదు రహిత చెల్లింపు విధానం అమలుకు ఆర్టీసీ సన్నద్ధమవుతోంది.

అన్ని బస్సుల్లో అమలు చేస్తాం



డిజిటల్ పేమెంట్లతో ఐ టిమ్ మిషన్లను రిజర్వేషన్ బస్సుల్లో ప్రవేశపెట్టాం. ఇది ప్రయాణికులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. చిల్లర సమస్య ఉండదు. ఏ సర్వీస్‌లో ఎన్ని సీట్లు ఉన్నాయో, ప్రతీది రికార్డ్ అవుతుంది. నగదుతో పాటు, నగదు రహిత సేవలను అన్ని బస్సుల్లో అమలు చేస్తాం.

– సరిరామ్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, ఖమ్మం

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం



మధిరలో యూజీడీ పనులకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, అధికారులు

మధిర : అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. మధిరలో రూ.128 కోట్లతో నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నిధులు సమకూరుస్తామని తెలిపారు. అనంతరం క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ.. యూజీడీ పనులను మే మొదటి వారంలో ప్రారంభించాలని, సకాలంలో పూర్తి చేసేందుకు స్పష్టమైన షెడ్యూల్ తయారు చేసి ఈనెల 16న హైదరాబాద్‌లో జరిగే సమావేశంలో సమర్పించాలని సూచించారు. 99.56 కి.మీ. మేర సీవరేజ్ పైప్‌లైన్, 6,638 గృహాలకు కనెక్షన్, నాలుగు సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ పనులను నాణ్యతతో చేపట్టాలని, అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణంతో పట్టణ వాసుల ఆరోగ్యం మెరుగుపడుతుందని, సీజనల్ వ్యాధుల వ్యాప్తి తగ్గడంతో పాటు పట్టణంలో పారిశుద్ధ్యం, గ్రీనరీ పెరిగేందుకు దోహదపడుతుందని తెలిపారు.

జాలిముడి నుంచి పైప్‌లైన్ వేయాలి..

పట్టణంలో తాగునీటి సరఫరాకు సమీపంలోని జాలిముడి ప్రాజెక్టును వనరుగా వినియోగించుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. ఇందుకోసం అవసరమైన పైప్‌లైన్ వేయాలని ఆదేశించారు. ట్యాంక్‌బండ్ అభివృద్ధికి పకడ్బందీ ప్రణాళికలు తయారు చేయాలని, ఈ అంశంపై నీటిపారుదల, టూరిజం, రోడ్లు, భవనాల శాఖాధికారులు ప్రతిపాదనలతో ఈనెల 16న హైదరాబాద్ రావాలని చెప్పారు. సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ మొదటి ఫ్లోర్‌ను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అనంతరం మండలంలోని వంగవీడు, కృష్ణాపురం, ఆత్కూరు గ్రామాల్లో నిర్మించనున్న బీటీ రోడ్ల పనులకు భట్టి శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ శ్రీజ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆర్డీఓ నర్సింహారావు, మున్సిపల్ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎస్.భాస్కర్‌రెడ్డి, ఎస్ఈ శ్రీనివాసరావు, మధిర మున్సిపల్ కమిషనర్ సంపత్, డీఈఈ నరేష్‌రెడ్డి, తహసీల్దార్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులు, వడగళ్ల వాన

- నాగులవంచలో 15.5 మి.మీ. వర్షపాతం
- వరి, మొక్కజొన్న, మామిడి పంటలకు తీవ్ర నష్టం



వైరా కృషి విజ్ఞాన కేంద్రం సమీపంలో కూలిన చెట్టు

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసింది. పగలంతా ఎండ తీవ్రత, ఉక్కపోత వాతావరణం ఉండగా సాయంత్రానికి మార్పు చోటు చేసుకుంది. ఖమ్మం నగరంతో పాటు పలు ప్రాంతాల్లో వడగళ్లతో కూడిన వర్షం కురిసింది. వాతావరణ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతకాని మండలం నాగులవంచలో 15.5 మి.మీ. వర్షం నమోదు కాగా, వైరా ఏఆర్‌ఎస్ వద్ద 14.0, సత్తుపల్లి మండలం జేవీఆర్ ఓసీ వద్ద 13.8, చింతకానిలో 13.5, ముదిగొండలో 11, సిరిపురంలో 10.8, ఖమ్మం ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్, బాణాపురంలో 7.5, వైరా, కొణిజర్లలో 7, ఖమ్మం ప్రకాష్‌నగర్‌లో 6.8, పెదగోపతిలో 3.8, తల్లాడలో 3.3, మధిర ఏఆర్‌ఎస్‌లో 1.3, పెనుబల్లిలో 1.0, మధిరలో 0.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. కాగా, ఈదురుగాలులు, వడగళ్ల వానతో జిల్లాలోని అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి వినియోగదారులు ఇబ్బంది పడ్డారు.

యాసంగి పంటలకు నష్టం..

ఈదురుగాలులు, వడగళ్ల వానతో యాసంగిలో సాగు చేసిన పలు పంటలకు నష్టం వాటిల్లుతోంది. వరి, మొక్కజొన్న పంటలు నేలవాలుతుండగా మామిడికాయలు రాలిపోతున్నాయి. మరికొన్ని చోట్ల కోతలు పూర్తయి కల్లాల్లో, రోడ్లపైన ఆరబెట్టిన ధాన్యం, మొక్కజొన్న, మిర్చి తడిసిపోతున్నాయి. మిర్చి తడిసి రంగు మారుతూ నాణ్యత దెబ్బతింటోంది.

ఉష్ణోగ్రతలూ అధికమే..

జిల్లాలో ఉష్ణోగ్రతలు కూడా అధికంగానే నమోదవుతున్నాయి. శనివారం 43.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా ఆదివారం ఖమ్మం నగరంలోని ఖానాపురంలో 42.1 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. ఇంకా పలు ప్రాంతాల్లో కూడా 40 డిగ్రీలకు పైగా ఉంటుండగా, ప్రజలు అల్లాడుతున్నారు.ఆదివారం పగలంతా ఎండతో ఇబ్బంది పడగా, రాత్రి వేళ ఈదురుగాలులతో కూడిన వర్షానికి విద్యుత్ సరఫరాలో అంతరాయంతో ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

మరికొన్ని వివరాలు - 9లో

'వనజీవి'కి కన్నీటి వీడ్కోలు

- అధికార లాంఛనాలతో ముగిసిన రామయ్య అంత్యక్రియలు
- నివాళులర్పించిన మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి
- వైకుంఠధామంలో మొక్కలు నాటిన అటవీ అధికారులు



పాడె మోస్తున్న తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్



ప్రచార బోర్డులతో అంత్యక్రియల్లో పాల్గొన్న కుటుంబసభ్యులు, బంధువులు

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంరూరల్ : కోటికి పైగా మొక్కలకు ప్రాణదాతగా నిలిచి.. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలినందించడమే ఆశయంగా జీవించి.. ప్రకృతి కాంతకు ఆకుపచ్చ రంగులద్దిన పర్యావరణ ప్రేమికుడు, పద్మశ్రీ వనజీవి (దరిపల్లి) రామయ్యకు పలువురు కన్నీటితో వీడ్కోలు పలికారు. ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లికి చెందిన రామయ్య శనివారం హఠాన్మరణం చెందగా.. పల్లెగూడెం వైకుంఠధామంలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. రామయ్య పార్థివదేహం వద్ద నివాళులర్పించేందుకు కవులు, కళాకారులు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, ప్రజా సంఘాల నాయకులు, గ్రామస్తులతో పాటు ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వృక్ష సంపదను పెంచేందుకు పద్మశ్రీ రామయ్య నిరంతరం కృషి చేశారని కొనియాడారు. అంత్యక్రియల ప్రారంభంలో రామయ్య సతీమణి జానకమ్మ స్పృహ కోల్పోగా అక్కడే ఉన్న ప్రభుత్వ వైద్యులు రాజశేఖర్ గౌడ్ సపర్యలు చేశారు.

మంత్రి పొంగులేటి ఘన నివాళి..

పద్మశ్రీ వనజీవి రామయ్య పార్థివదేహం వద్ద రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. ఎంపీ రఘురాంరెడ్డితో కలిసి ఘనంగా నివాళులర్పించారు. రామయ్య సతీమణి జానకమ్మ పొంగులేటిని చూసి బోరున విలపించగా, ఆమెను ఓదార్చి ధైర్యం చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పక్షాన, తన పక్షాన రామయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రామయ్య చిరకాల కోర్కెలను నెరవేర్చేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.



రామయ్య సతీమణి జానకమ్మను ఓదార్చుతున్న మంత్రి పొంగులేటి

అధికార లాంఛనాలతో..

పద్మశ్రీ వనజీవి రామయ్య అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు, ఏదులాపురం మున్సిపల్ అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. ఖమ్మంరూరల్ తహసీల్దార్ పి.రాంప్రసాద్, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి పాడె మోశారు. జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొని రామయ్యకు వందనం చేసి కడసారి వీడ్కోలు పలికారు.

మొక్కలకు, రామయ్యకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ వైకుంఠధామంలో మొక్కలు నాటారు. మొక్కల పెంపకం, రక్షణపై చేపట్టిన ప్రచార కార్యక్రమాల బోర్డులను కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు ధరించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమబాటే

టీజీఈజేఏసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఏలూరి



మాట్లాడుతున్న ఏలూరి శ్రీనివాసరావు, పక్కన నాయకులు

ఖమ్మం సహకారనగర్ : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేదంటే ఉద్యమ బాట పడతామని తెలంగాణ రాష్ట్ర ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని టీఎన్జీఓస్ భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ మినహా ఏ రాష్ట్రంలోనూ ఐదు డీఏలు పెండింగ్ లేవని, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. త్వరలో ఖమ్మంలో ఉద్యోగుల సదస్సు భారీ స్థాయిలో నిర్వహించి రాష్ట్రంలోనే రోల్‌మోడల్‌గా నిలవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీజీఈజేఏసీ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు, కన్వీనర్ కస్తాల సత్యనారాయణ, కో చైర్మన్లు యలమద్ది వెంకటేశ్వర్లు, రాయల నర్సింహారావు, పారుపల్లి నాగేశ్వరరావు, రంజాన్, రాష్ట్ర కో చైర్మన్ దేవరకొండ సైదులు, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుంబూరు సునీల్‌రెడ్డి, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు కొణిదన శ్రీనివాస్, తాళ్లూరి శ్రీకాంత్, వేలాద్రి, యాదగిరి, వెంకటేశ్వర్లు, మన్సూర్, కె.వేణుగోపాల్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడు జిల్లా పరిషత్ పాఠశాలలో 2005 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆనాటి హెచ్ఎం ఎం.శ్రీనివాస్ ఉపాధ్యాయులు వెంకట్, నారాయణ, పుల్లారావు, రఘునాథ్, బ్రహ్మాచారి, కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, లక్ష్మీకుమారి, భాగ్యరేఖ, వసుంధరను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు యాతాకుల నాగేశ్వరరావు, ఎం.శ్రీకాంత్, శ్రీనాథ్, స్వరూప, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

కులవ్యవస్థ మన దేశంలోనే ఉంది



అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేస్తున్న కృష్ణమాదిగ

ముదిగొండ: ఏ దేశంలో లేని కులవ్యవస్థ మన దేశంలోనే ఉందని, భారత రాజ్యాంగం, సుప్రీంకోర్టు తీర్పు వల్లనే ఈ వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ముదిగొండ మండలం వల్లభిలో ఆదివారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. రామాలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కృష్ణమాదిగ మాట్లాడారు. 30 ఏళ్ల నుంచి వర్గీకరణ కోసం పోరాటం చేస్తూనే ఉన్నామని, నేడు రాజ్యాంగం, సుప్రీంకోర్టు తీర్పు వల్ల వర్గీకరణ సాధించుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో గుండెపాక నర్సయ్యమాదిగ, మందా దేవేంద్రం, ప్రసాద్‌మాదిగ, ఏపూరి వెంకటేశ్వర్లుమాదిగ, నూకల నాగేశ్వరరావుమాదిగ, బొడ్డు అనిల్ మాదిగ, పగిడి కత్తుల నాగేశ్వరరావుమాదిగ, గోపాల్‌రావుమాదిగ, సూరపల్లి కిరణ్‌మాదిగ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంపై పిడుగుపాటు



పిడుగు పడడంతో కాలిపోయిన రికార్డులు

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో పిడుగు పడి, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి ప్రమాదం జరిగింది. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి అంగన్వాడీ కేంద్రంపై పిడుగు పడటతో రికార్డులు, పిల్లల ఆట వస్తువులు, భోజన పదార్థాలు కాలి బూడిదయ్యాయి. భారీ వర్షానికి విద్యుత్ సరాఫరాకు అంతరాయం ఏర్పాడింది.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న చావా దుర్గాభవాని

ఖమ్మంసహకారనగర్: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సంఘం కార్యాలయంలో 12వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించగా ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం నర్సరీ, కేజీ తరగతులను ప్రవేశపెట్టి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించి, ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నమోదు పెంచడం కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న కేజీబీవీ, సర్వశిక్ష ఉద్యోగ ఉపాధ్యాయులకు పోస్టుకు తగ్గ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తొలుత సీనియర్ నాయకులు మందడపు శ్రీనివాసరావు సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, షమీ, రాంబాబు, రాందాస్, నాగేశ్వరరావు, సురేశ్, వలీ, పద్మ, రోజా, పద్మజ, సుధాకర్, రమణ, రాజశేఖర్, వీరబాబు, విక్రంరెడ్డి పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన ఏపీ రైతులు

దమ్మపేట: ఏపీకి చెందిన పామాయిల్ రైతులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం మండలంలోని గండుగులపల్లి నివాసంలో మంత్రి తుమ్మలను ఏపీ పామాయిల్ రైతులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి మాట్లాడారు. ఏపీలో పండిన పామాయిల్ గెలలను అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో క్రషింగ్ చేసేందుకు అనుమతి ఇచ్చినందుకు గాను హర్షం వ్యక్తం చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.21,000

ఖమ్మంలో మామిడి మార్కెట్ !

- రైతులు, వినియోగదారులకు ప్రయోజనం కలిగేలా ఏర్పాటు
- కార్బైడ్ రహిత మామిడి పండ్లు మాత్రమే అమ్మకం
- ముస్తాబవుతున్న రోటరీనగర్ వీధివ్యాపారుల ప్రాంగణం



వీధివ్యాపారుల ప్రాంగణంలో రంగులు వేస్తున్న దృశ్యం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మంలో మామిడి రైతు మార్కెట్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో మామిడి రైతులకు, వినియోగదారులకు ప్రయోజనం కలిగే విధంగా ఈ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఖమ్మం నగరంలోని రోటరీనగర్(ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్ పక్కన) వీధి వ్యాపారుల ప్రాంగణంలో రైతులు తాము పండించిన మామిడి పండ్లను విక్రయించుకునేలా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాలు జారీ చేశారు. మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా రైతులు నేరుగా తమ పంటను విక్రయించుకునే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఉద్యాన శాఖ అధికారులకు సూచించారు. కార్బైడ్ రహిత మామిడి పండ్లను మాత్రమే ఈ మార్కెట్‌లో విక్రయించేందుకు అనుమతి ఇవ్వాలని కూడా ఆదేశించారు. రైతులకు లాభదాయకంగా, కొనుగోలుదారులకు నాణ్యమైన పండ్లు అందేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రోటరీనగర్ వీధి వ్యాపారుల ప్రాంగణంలో ప్లాట్ ఫామ్స్‌కు రంగులు వేసే కార్యక్రమం కూడా చేపట్టారు. జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా మామిడి సాగవుతోంది. ఈ క్రమంలో మామిడి సాగును, రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఖమ్మంలో మామిడి మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. జిల్లాలో 31 వేల ఎకరాలకు పైగా మామిడి సాగులో ఉంది. ఈ పంట సాగు చేసిన రైతులు తాము పండించిన పంటను నేరుగా విక్రయించుకునే విధంగా ఖమ్మంలో మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. నూతనంగా ఏర్పాటు చేయనున్న మామిడి మార్కెట్‌లో రైతులు పాటించవలసిన విధివిధానాలను జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమాధికారి ఎం.వి.మధుసూదన్ ప్రకటించారు.



మామిడి రైతులతో చర్చిస్తున్న జిల్లా ఉద్యానాధికారి మధుసూదన్

రైతులు పాటించాల్సిన నిబంధనలు

- రైతులు వచ్చి స్వయంగా మామిడి పండ్లను మార్కెట్లో అమ్ముకోవాలి. మామిడి తోట ఉన్న రైతులకు మాత్రమే అవకాశం ఉంటుంది.
- కార్బైడ్ రహిత మామిడి పండ్లను మాత్రమే విక్రయించాలి.
- రైపెనింగ్ చాంబర్‌లో ఇథలిన్ గ్యాస్‌తో మాగబెట్టిన పండ్లు మాత్రమే అమ్మాలి.
- రైతులు మామిడి పండ్లను ప్లాస్టిక్ ట్రేలలో తెచ్చుకొని రైపెనింగ్ చాంబర్‌లో పెట్టాల్సి ఉంటుంది.

రైతులు సంప్రదించాల్సిన ఉద్యాన అధికారుల వివరాలు

అధికారి	సెల్ నంబర్	మండలాలు
అపర్ణ	89777 14104	కూసుమంచి, తిరుమలాయపాలెం నేలకొండపల్లి, ఖమ్మం రూరల్
ఆకుల వేణు	89777 14105	వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, కామేపల్లి
జి.నగేష్	89777 14103	ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం, కల్లూరు , తల్లాడ, పెనుబల్లి
ఎ.విష్ణు	89777 14113	మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
జి.శ్రావణి	89777 14114	సత్తుపల్లి, వేంసూరు

రామయ్యకు సువర్ణ పుష్పార్చన





నిత్యకల్యాణంలో పెద్ద ఎత్తున పాల్గొన్న జంటలు (ఇన్‌సెట్) స్వామివారి కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిలిపివేసిన నిత్యకల్యాణాలను ఆదివారం పునఃప్రారంభించారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. కాగా వరుస సెలవు దినాలు రావడంతో దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం స్వామివారి మూలమూర్తులను దర్శించుకున్నారు. స్వామి ఆర్జిత సేవలు, నిత్యకల్యాణంలో సైతం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. లడ్డూ కౌంటర్ల వద్ద రద్దీ నెలకొంది.

భారత రాజ్యాంగమే బీజేపీ అజెండా



ఖమ్మంమామిళ్లగూడెం: అంబేడ్కర్ విగ్రహం వద్ద శుభ్రం చేస్తున్న పొంగులేటి సుధాకర్‌రెడ్డి

ఖమ్మంమామిళ్లగూడెం: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగమే బీజేపీ అజెండా అని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ తమిళనాడు రాష్ట్ర సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఖమ్మం నగరం జెడ్పీసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన శుభ్రం చేశారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావుతో కలిసి మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని పకడ్బందీగా అమలు చేసేది కేవలం బీజేపీ మాత్రమేనన్నారు. ఎన్నడూ లేని విధంగా దళిత, గిరిజన వర్గాలకు చెందిన వారిని రాష్ట్రపతులను చేసిన ఘనత బీజేపీకి దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో గోంగూర వెంకటేశ్వర్లు, సన్నె ఉదయ్‌ప్రతాప్, దొంగల సత్యనారాయణ, నంబూరి రామలింగేశ్వరరావు, దేవకీ వాసుదేవరావు, ఈవీ రమేశ్, నున్నా రవికుమార్, కోటమర్తి సుదర్శన్, నల్లగట్టు ప్రవీణ్‌కుమార్, నీరుకొండ ఉషారాణి, రేఖ సత్యనారాయణ, మాదుగుల చిన్నికృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా, శుభ్రం చేసి దిగుతున్న క్రమంలో సుధాకర్‌రెడ్డి కాలు జారి మెట్లపై పడ్డాడు. కార్యకర్తల అప్రమత్తతతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

హామీల అమలులో విఫలం

కల్లూరురూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ఘోరంగా విఫలమైందని బీజేపీ జాతీయ నాయకుడు, తమిళనాడు రాష్ట్ర సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి విమర్శించారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు గావ్ చలో, బస్తీ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా కల్లూరు మండలంలోని పేరువంచ గ్రామంలో ఆదివారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పేరువంచలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి అయిన పొంగులేటి సుధాకర్‌రెడ్డి పాఠశాలలో మంచినీటి సౌకర్యం కల్పించడం కోసం రూ.1,10,016లు విరాళంగా అందించారు. గ్రామంలో రేషన్‌షాపును సందర్శించి పేదలకు సన్న బియ్యం పంపిణీని సమీక్షించారు. ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. గుమ్మా రామకృష్ణ, నున్నా రవి, నంబూరి రామలింగేశ్వరరావు, వీరం రాజు, మిశ్రా, సుదర్శన్, సుబ్బారావు పాల్గొన్నారు.

టీయూసీఐ నేతృత్వంలో భవిష్యత్ పోరాటాలు



ర్యాలీ పాల్గొన్న టీయూసీఐ నాయకులు, కార్యకర్తలు

వైరా: భవిష్యత్‌లో కార్మిక వర్గాలు నిర్వహించే ప్రతి పోరాటానికి టీయూసీఐ నాయకత్వం వహిస్తుందని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం అన్నారు. టీయూసీఐ ఖమ్మం జిల్లా ప్రథమ మహాసభ స్థానిక కామిశెట్టి కల్యాణ మండపం (ఆడెపు రామారావు ప్రాంగణం)లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో వైరాలో భారీ ప్రదర్శన నిర్వహించిన అనంతరం సూర్యం మాట్లాడారు. ప్రభుత్వాలు ఉచిత పథకాలు ఇచ్చి ప్రజలను సోమరిపోతులను చేస్తున్నారన్నారు. భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులు నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు మాత్రమే సంపాదిస్తున్నారని వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సదుపాయాలు దక్కడం లేదని తెలిపారు. మే 20న దేశవ్యాప్తంగా చేపట్టే సమ్మెలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సభలో డాక్టర్ మోహన్‌రావు, దొబ్బల శిరీష, గొకినేపల్లి వెంకటేశ్వరరావు, అర్జున్‌రావు, రామయ్య, ఆవుల అశోక్, శ్రీనివాసులు, డి.శ్రీనివాసరావు, ఎలదండి బాబు, సీవై పుల్లయ్య, ఎస్‌కే లాల్‌మియా, రామదాసు, వెంకన్న, పుల్లయ్య, పుల్లారావు, సుధ, కృష్ణవేణి, శ్రీనివాసులు, శరత్, ఎస్‌కే యాకూబ్‌షావలీ, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

లోన్ పేరుతో డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై కేసు

పాల్వంచ: ప్రైవేట్ బ్యాంక్‌లో లోన్ ఇప్పిస్తానని చెప్పి డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని వెంకటేశ్వర హిల్స్ కాలనీకి చెందిన భాషబోయిన అశోక్‌కుమార్‌కు వద్దని చెప్పినా వినకుండా తిప్పరపు విజయ్ అనే వ్యక్తి రూ.20 లక్షల లోన్ ఇప్పిస్తానని ఒప్పించాడు. 20 రోజుల్లో వస్తుందని, ముందస్తు రూ.3.19 లక్షలు ఇవ్వాలని చెప్పాడు. దీంతో అశోక్‌కుమార్ డబ్బులను గత డిసెంబర్‌లో ఇచ్చాడు. అయినప్పటికీ లోన్ రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్‌ఐ సుమన్ అజయ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోషకాహార లోపంతో బాలుడు మృతి?

అశ్వారావుపేటరూరల్: పోషకాహారం, అనారోగ్య కారణాలతో ఓ వలస గొత్తికోయ బాలుడు మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని చెన్నాపురం అటవీ ప్రాంతంలో గల చెన్నాపురం కాలనీ గ్రామానికి చెందిన యమ్లా బంటి కుమారుడు బాలు (2) ఏడాదికాలంగా ఉదరం పెరిగి అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. కాగా, ఆదివారం బాలుడు తీవ్ర అస్వస్థతకు గురై వాంతులు చేసుకోవడంతో పరిస్థితి విషమించింది. గమనించిన తల్లిదండ్రులు ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మృతిచెందాడు.

జిల్లా 'కుంగ్‌ఫూ' కమిటీ ఎన్నిక

కొత్తగూడెంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కుంగ్‌ఫూ, మార్షల్ ఆర్ట్స్ మాస్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ప్రకాశం స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఐ.ఆదినారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఎస్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా పి.కాశీ హుస్సేన్, కోశాధికారిగా బి.కనకరాజు, ఉపాధ్యక్షులుగా ఎస్‌కే హుస్సేన్‌ఖాన్, కె.శ్రీనివాస్, బి.మల్లికార్జున్, ఐ.మోహన్‌రావు, వై.సుబ్రహ్మణ్యం, సంయుక్త కార్యదర్శులుగా బి.బుచ్చయ్య, ఎం.రాజయ్య, హరిబాబు, ఎస్.సత్యనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శి బి.సాగర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు లీల శ్రీనివాస్, ఎస్.సతీశ్, ఎం.దామోదర్, బాబు, వి.శ్రీకాంత్, ఎస్.రమేశ్‌ను ఎన్నుకున్నట్లు అసోసియేషన్ బాధ్యులు తెలిపారు.

కవలల అదృశ్యంపై సస్పెన్స్ వీడేనా?

చింతకాని: మండలంలోని నాగులవంచ రైల్వేకాలనీలో వెలుగు చూసిన కవల ఆడ శిశువుల అదృశ్యంపై సస్పెన్స్ వీడేలా కనిపించడం లేదు. నాగులవంచ రైల్వేకాలనీకి చెందిన నల్లగాజు ఉమ గత నెల 31న ఖమ్మం గాంధీచౌక్ ప్రాంతంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో కవల ఆడ శిశువులకు జన్మనిచ్చింది. ఉమకు అంతకుముందు ఇద్దరు ఆడ పిల్లలు ఉండగా మళ్లీ కవల ఆడ శిశువులు జన్మించడంతో ఉమ భర్త నల్లగాజు మల్లేశ్ వారిని ఖమ్మంలోని వేర్వేరు కులాలకు చెందిన ఇద్దరికి దత్తత ఇచ్చి ఇంటికి వచ్చారు. ఆ తర్వాత ఉమ ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేందుకు వచ్చిన ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు దత్తత విషయం తెలుసుకుని అధికారులకు సమాచారం అందించగా ఐసీడీఎస్ సీడీపీఓ కమలప్రియ, ఏసీడీపీఓ శివకుమారి, సూపర్‌వైజర్ పద్మావతి కలిసి శుక్రవారం మల్లేశ్ ఇంటికి వెళ్లారు. కవల శిశువుల గురించి ప్రశ్నించగా దురుసుగా సమాధానం చెప్పడమే కాకుండా మహారాష్ట్రలోని చంద్రాపూర్‌లో ఉంటున్న ఉమ అక్కకు దత్తత ఇచ్చామని మల్లేశ్ తప్పుడు సమాచారం ఇచ్చాడు. చట్టానికి లోబడి దత్తత ఇవ్వాలని, చట్ట విరుద్ధంగా దత్తత ఇస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించడంతో ఈ నెల 14వ తేదీన తీసుకొస్తామని లిఖితపూర్వకంగా రాసిచ్చారు. కానీ, కవల ఆడ శిశువుల దత్తత విషయంలో పలు సందేహాలు వస్తుండటంతో నిఘా వర్గాలు, ఐసీడీఎస్ అధికారులు ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి ఆరా తీశారు. ఆస్పత్రి నుంచి వెళ్లిన తర్వాత ఖమ్మం నగరంలోనే ఉండే ఆస్పత్రి ల్యాబ్‌లో పనిచేసే వ్యక్తి బంధువులకు ఒక శిశువును, మరో దంపతులకు స్టాంప్ పేపర్‌పై ఒప్పందం చేసుకుని దత్తత ఇచ్చినట్లు తెలుస్తోంది. కాగా, ఓ శిశువును ఐసీడీఎస్ అధికారులు గుర్తించి, స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించగా.. వారు తల్లిదండ్రులకు అప్పగిస్తామని చెప్పినట్లు అధికారులు తెలిపారు. మరో శిశువు మహబూబాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు.

హత్యకు ప్రణాళిక.. ఐదుగురు అరెస్ట్

వివాహేతర సంబంధం నేపథ్యంలో కుట్ర



నిందితులను చూపుతున్న సీఐ భానుప్రకాష్

ఖమ్మంఅర్బన్: వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ మహిళ భర్తను హత్య చేయించేందుకు ఐదుగురు కలిసి ప్రణాళిక రచించిన ఘటన వెలుగులోకి వచ్చింది. హత్యకు రూ.20 లక్షల సుపారీ ఇస్తానని, అందులో అడ్వాన్స్‌గా రూ.ఐదు లక్షలు ఇచ్చినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ కేసులో ఐదుగురిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్టు ఖమ్మంఅర్బన్ (ఖానాపురం హవేలీ) సీఐ భానుప్రకాష్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ముదిగొండ మండలం సువర్ణపూరానికి చెందిన ఓ వివాహితకు అదే గ్రామానికి చెందిన కొండూరి రామాంజనేయులు అలియాస్ రాముతో వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయం ఆమె భర్తకు తెలిసి దంపతుల మధ్య విభేదాలు పెరిగాయి. ఈ క్రమంలో మహిళ భర్తను చంపేందుకు రామాంజనేయులు ప్రణాళిక రచించాడు. ఖమ్మంరూరల్ మండలం బారుగూడెం గ్రామానికి చెందిన దంతాల వెంకటనారాయణ అలియాస్ వెంకట్‌ను సంప్రదించి హత్య విషయమై వివరించాడు. వెంకట్ తన స్నేహితుడు, రౌడీషీటర్ అయిన పగడాల విజయ్‌కుమార్ అలియాస్ చంటిని పరిచయం చేశాడు. హత్యకు రూ.20 లక్షలు సుపారీగా ఒప్పుకొని, మొదటగా రూ.ఐదు లక్షలు అడ్వాన్స్‌గా తీసుకున్నారు. ఈ క్రమంలో మార్చి 12న ఖమ్మం నగరంలోని ధంసలాపురం వద్ద సదరు మహిళ భర్తను కిడ్నాప్ చేశారు. మిగతా డబ్బు కోసం రామును సంప్రదిస్తే స్పందించకపోవడంతో ఆమె భర్తను బెదిరించి రూ.1,50,000 నగదు, బంగారు గొలుసు తీసుకొని వదిలేశారు. కాగా, సదరు వ్యక్తి ఏప్రిల్ 11న ఖమ్మంఅర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, నగర ఏసీపీ రమణమూర్తి పర్యవేక్షణలో విచారణ చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిందితులు సువర్ణాపురానికి చెందిన పొక్లెయిన్ ఆపరేటర్ కొండూరి రామాంజనేయులు, దంతాల వెంకటనారాయణ (కారుడ్రైవర్, బారుగూడెం, ఖమ్మంరూరల్), పగాడాల విజయ్‌కుమార్ (చంటి – బైక్ మెకానిక్, అగ్రహారంకాలనీ, ఖమ్మం), వేముల కృష్ణ (బైక్ మెకానిక్, అగ్రహారంకాలనీ, ఖమ్మం), బుర్రి విజయ్ (డెకరేషన్ వర్కర్, బృందావన్‌కాలనీ పువ్వాడఅజయ్‌నగర్, ఖమ్మం) ఆదివారం నగర శివారులోని చెరుకూరి మామిడి తోటలో సమావేశమైనట్లు తెలుసుకొని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి రెండు కత్తులు, ఒక ఎయిర్ గన్, రూ.90,000 నగదు, 5 సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ భానుప్రకాష్ వివరించారు.

గడ్డివామి దగ్ధం

టేకులపల్లి: మంటలు చెలరేగి గడ్డివామి దగ్ధమైన ఘటన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని కొత్తతండా(జే)కు చెందిన రైతు బానోత్ కిషన్ తన పశువుల కోసం సుమారు 250 కట్టల గడ్డివామి ఇంటి సమీపంలో ఏర్పాటు చేసుకున్నారు. ఆదివారం ప్రమాదవశాత్తు గడ్డివామిపై నిప్పులు పడటంతో మంటలు చెలరేగి వామి మొత్తం కాలిపోయింది. సమాచారం తెలుసుకున్న కొత్తగూడెం అగ్నిమాపక వాహనం వచ్చి మంటలు చుట్టుపక్కలకు వ్యాపించకుండా ఆర్పివేశారు. సుమారు రూ.25 వేలు నష్టం వాటిల్లిందని కిషన్ తెలిపారు.

ముగిసిన ఐదు రాష్ట్రాలస్థాయి కబడ్డీ పోటీలు



ప్రథమ బహుమతి గెల్చుకున్న సూర్యాపేట జట్టు

తల్లాడ: మండలంలోని కుర్నవల్లి వేంకటాచలపతి దేవాలయం వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించిన ఐదు రాష్ట్రాలస్థాయి కబడ్డీ పోటీలు శనివారం అర్ధరాత్రి ముగిశాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ప్రథమ బహుమతి సూర్యాపేట, ద్వితీయ బహుమతి ఈస్ట్‌గోదావరి, మూడో బహుమతి కర్ణాటక జట్లు సాధించాయి. నాలుగోస్థానంలో మిషన్ ఆంధ్రప్రదేశ్, ఐదోస్థానంలో కొత్తగూడెం, ఆరోస్థానంలో వైజాగ్, ఏడోస్థానంలో విజయవాడ, ఎనిమిదోస్థానంలో తమిళనాడు, తొమ్మిదోస్థానంలో నాగర్‌కర్నూలు, పదోస్థానంలో మహబూబాబాద్ జిల్లా వెంకట్రామాపురం నిలిచాయి. ఈ సందర్భంగా వేంకటాచలపతి కల్యాణం నిర్వహించి, మహా అన్నదానం చేశారు. భాస్కర్‌రెడ్డి, సుజాతరెడ్డి, కల్యాణం రమేశ్, భరత్‌బాబు, ఐలయ్య, అయిలూరి శేషిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటకోటారెడ్డి, దోకుపర్తి రామ్మూర్తి, పోతురాజు వెంకటయ్య, కోటయ్య, కట్టా దర్గయ్య, దూళ్ల జనార్దన్ పాల్గొన్నారు.

వైద్యులకు అండగా నిలుస్తా..



మాట్లాడుతున్న ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి

ఖమ్మంవైద్యవిభాగం: ప్రజలకు చికిత్స అందించి ప్రాణాలు కాపాడుతున్న వైద్యులందరికీ అండగా నిలుస్తానని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి హామీ ఇచ్చారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఐఎంఏ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన డాక్టర్ల పునశ్చరణ శిబిరాన్ని రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఆరోగ్య జాగ్రత్తలపై పజల్లో మరింత చైతన్యం నింపాలని సూచించారు. పార్కింగ్ అనుమతుల విషయంపై కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని, లైసెన్స్ క్లియరెన్స్ సమస్య పరిష్కారానికి కూడా కృషి చేస్తానని అభయమిచ్చారు. కార్యక్రమంలో వైద్యులు కంభంపాటి నారాయణరావు, బొల్లికొండ శ్రీనివాస్‌రావు, కుసుమరాజు రవికుమార్, సతీశ్‌నారాయణ చౌదరి, జీవీ, మురళి, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఫీడర్లపై ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్ల ఏర్పాటు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ అంతరాయం కలిగిన భాగాన్ని సులువుగా గుర్తించి సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు అనువుగా 33 కేవీ, 11 కేవీ ఫీడర్లపై ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్ల ఏర్పాటుకు సంస్థ చర్యలు చేపట్టింది. బ్రేక్ డౌన్ సమయంలో, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు చోటు చేసుకునే విద్యుత్ అంతరాయాన్ని గుర్తించేందుకు విద్యుత్ లైన్లను తనిఖీ చేసే అవసరం లేకుండా అంతరాయం కలిగిన భాగాన్ని ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్ విభజిస్తుంది. అంతేగాక విద్యుత్ లైన్‌లో ఏ భాగంలో సమస్య ఎక్కడ జరిగింది అనే విషయాన్ని కూడా తెలుపుతుంది. జిల్లాలో పద్దెనిమిది 33 కేవీ ఫీడర్లలో 78 ప్రదేశాల్లో, 37, 11 కేవీ ఫీడర్లలో 170 ప్రదేశాల్లో ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్లను ఏర్పాటు చేసేందుకు గుర్తించినట్లు ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు.

వివాహిత బలవన్మరణం

మహబూబాబాద్‌లో ఘటన

మహబూబాబాద్ రూరల్ : పాల్వంచకు చెందిన ఓ వివాహిత ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పాల్వంచ పట్టణానికి చెందిన శ్రీపాద రవిచంద్ర, నవ్య దంపతులు కొద్ది నెలల క్రితం మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చి స్థిరపడ్డారు. నర్సంపేట బైపాస్ రోడ్‌లో రెడీమేడ్ షాప్ నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం వివాహ వేడుకకు హాజరై సాయంత్రం వచ్చారు. రవిచంద్ర షాపులో ఉండగా నవ్య ఇంట్లోకి వెళ్లింది. కాసేపటి తర్వాత రవిచంద్ర ఇంట్లోకి వెళ్లి చూడగా నవ్య ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడి కనిపించింది. విషయం తెలుసుకున్న టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై బి.విజయ్ కుమార్ ఘటనా స్థలికి చేరుకుని నవ్య మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కాగా, నవ్య ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదని, ఈ ఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని సీఐ దేవేందర్ పేర్కొన్నారు.